ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 24 ఆగస్టు 2025



పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): యువతను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా శిక్షణ నిర్వహిస్తున్నామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 'ట్రైడ్స్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరిశ్రమల వ్యవస్థాపన, నైపుణ్యాలపై పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, రణస్థలంలో నెలరోజులు శిక్షణ ఉంటుంది. తెల్లరేషన్ కార్డు కలిగి.. 18 నుంచి 40 ఏళ్ల మధ్య వారు అర్హులు. జిల్లా పరిశ్రమల కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలి. ఇతర వివరాలకు 86884 55692 నెంబరులో సంప్రదించాల'ని శ్రీధర్ సూచించారు.

డీఎస్సీలో సిక్కోలు సత్తా



- మెరిట్ జాబితాలో జిల్లావాసులకు ర్యాంకులు
- రేపు సర్టిఫికెట్ల పరిశీలన
- 28న ఎంపిక జాబితా ప్రకటించే అవకాశం
- ఉపాధ్యాయ దినోత్సవం నాటికి నియామక ఉత్తర్వులు

నరసన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి శుక్రవారం రాత్రి విడుదలైన మెరిట్ జాబితాలో జిల్లావాసులు సత్తాచాటారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 543 పోస్టులు ఉండగా, అందులో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) పోస్టులు 113(ఏజెన్సీతో కలిపి) ఉన్నాయి. ఎస్జీటీ పోస్టులకు సంబంధించి 6,032 మంది పరీక్ష రాయగా.. మార్కుల ప్రాతిపదికన మెరిట్ జాబితా విడుదల చేశారు. తొలి 12 స్థానాల్లో మొదటిస్థానం మినహా.. మిగిలిన స్థానాల్లో మహిళలు సత్తాచాటారు. ఎస్జీటీలో జిల్లాకు చెందిన అన్నెపు సింహాద్రినాయుడు 96.40 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. కుంచాల జ్యోతి 93.96, డోల శిరీష 92.36, మంతెన అనురాధ 92.24 మార్కులతో మొదటినాలుగు స్థానాలు పొందారు. 90 మార్కులు దాటి 16 మంది, 80 మార్కులు దాటిన వారిలో 170 మంది అభ్యర్థులు ఉన్నారు.

- స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో 1,038 మంది పరీక్షలు రాశారు. మీసాల గోవిందరావు 85.43 మార్కులతో ప్రథమస్థానం, సారవకోట సౌమ్య 83.96 మార్కులతో ద్వితీయ స్థానం, బెజ్జిపురం వెంకటరమణ 83.5 మార్కులు, బొడ్డేపల్లి యామిని కుమారి 82.41 మార్కులతో నాల్గోస్థానం పొందారు.
- స్కూల్ అసిస్టెంట్ హిందీ విభాగంలో 416 మంది పరీక్షలు రాశారు. వీరిలో లంకా చక్రపాణి 85.55 మార్కులతో మొదటిస్థానం (మిగతా 4వ పేజీలో..)

ఎస్జీటీలో శేషాద్రినాయుడు ప్రతిభ

- తోలాపి యువకుడికి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం


శేషాద్రి నాయుడు

పొందూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ మెరిట్ జాబితాలో పొందూరు మండలం తోలాపి గ్రామానికి చెందిన అన్నెపు శేషాద్రినాయుడు ప్రతిభ చూపారు. ఎస్జీటీ విభాగంలో 96.4017 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. తల్లిదండ్రులు ధర్మారావు, జగదాంబ ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులే. శేషాద్రినాయుడు ప్రథమస్థానం సాధించడంపై తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ శేషాద్రినాయుడును అభినందిస్తూ.. ఆయనను యువత ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

● తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే..

'నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే నేను ఈ ర్యాంకును సాధించాను. ప్రభుత్వం ఇటీవల మార్కులు విడుదల చేసినపుడే నాకు మొదటిర్యాంకు వస్తుందని తెలుసు. నాపై తల్లిదండ్రులు ఎటువంటి ఒత్తిడి చేయకుండా పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకు కష్టపడి చదివాను' అని శేషాద్రినాయుడు తెలిపారు.

పారదర్శకంగా నియామకాలు..

డీఎస్సీ నియామకాల విషయంలో రాష్ట్ర విద్యాశాఖ చాలా జాగ్రత్తలు తీసుకుంటోంది. గత ఘటనల దృష్ట్యా అక్రమాలకు, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నియామకాల పక్రియకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనలో జాగ్రత్తలు తీసుకుంటోంది. గతంలో కొన్ని కమిటీలు వేసి అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించేవారు. ముందుగానే ఏ సబ్జెక్టుకు ఏ టీమ్ సభ్యులు ఉన్నారో తెలిసిపోయేది. అందులో అనుకూలమైన వారితో సర్టిఫికెట్లలో కొన్ని పొరపాటు ఉన్నా ఓకే చేయించుకుని వెళ్లేవారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది నాన్‌లోకల్ వారు లోకల్‌గా చదివినట్లు బోగస్ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందినట్టు విమర్శలు ఉన్నాయి. ఈసారి అలాంటి వాటికి అవకాశం లేకుండా సర్టిఫికెట్ల పరిశీలనలో గోప్యత పాటిస్తున్నారు. ఎంపికైన అభ్యర్థుల ఫోన్‌కు సర్టిఫికెట్ల పరిశీలన తేదీ, కేంద్రం, కమిటీ వివరాలను పంపనున్నారు.

- ఈ నెల 25న శ్రీకాకుళం మహాలక్ష్మి నగర్ కాలనీలోని విశ్వవిజేత జూనియర్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలనకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం 12 బృందాలను నియమించారు. ఎంపికైన అభ్యర్థులు సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ ఓకే అయిపోతుంది. ఒకవేళ సమస్యలు ఉత్పతన్నమైతే పరిశీలన బృందం సభ్యులు బాధ్యత వహించాల్సి ఉంది. ఈ నెల 28నాటికి ఎంపిక జాబితాను రోస్టర్ మేరకు ప్రకటిస్తారు. వచ్చే నెల 5న ఉపాధ్యాయ దినోత్సవం నాటికి నియామక పత్రాలను అందజేసేందుకు రాష్ట్ర విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

తెలుగులో ధర్మారావు టాప్

- 'పీజీటీ'లో రాష్ట్రస్థాయిలో తొలిస్థానం


పట్నాన ధర్మారావు

జి.సిగడాం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ మెరిట్ జాబితాలో జి.సిగడాం మండలం వాండ్రంగి గ్రామానికి చెందిన పట్నాన ధర్మారావు టాపర్‌గా నిలిచారు. పీజీటీ తెలుగులో 85.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించారు. అలాగే టీజీటీ తెలుగు విభాగంలో 82.57 మార్కులతో రాష్ట్రస్థాయిలో 5వ స్థానం, జోన్ పరిధిలో 5వ స్థానంలో నిలిచారు. స్కూల్ అసిస్టెంట్ తెలుగు విభాగంలో 88.01 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానం పొందారు. ధర్మారావు ప్రస్తుతం ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ఉత్తరాంధ్ర బాలల కథా సాహిత్యం-సామాజికత అనే అంశంపై పరిశోధన చేస్తున్నారు. నిరుపేద వడ్రంగి కుటుంబంలో పుట్టిన ధర్మారావు విజయమే లక్ష్యంగా ముందుకు సాగారు. ఇటు తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చారు. ధర్మారావును తల్లిదండ్రులు లక్ష్మి, తిరుపతిరావుతోపాటు గ్రామస్థులు అభినందించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్య జర్రా అప్పారావు, పీహెచ్‌డీ పర్యవేక్షకులు అయ్యగారి సీతారత్నం, నామ విజ్ఞానవేత్త వాండ్రంగి కొండలరావు, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

- 'ఉపాధ్యాయ ఉద్యోగం సాధించాలనే ధృఢ సంకల్పంతో కష్టపడి చదివాను. తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చడమే ధ్యేయంగా అహర్నిశలు శ్రమించాను. కష్టానికి తగిన ఫలితం దక్కినందుకు ఆనందంగా ఉంద'ని ధర్మారావు తెలిపారు.

సముద్రపు నాచుతో ఉపాధి

- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడిన మూలపొలం మహిళ

సోంపేట రూరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): సోంపేట మండలం మూలపొలం గ్రామానికి చెందిన డ్వాక్రామహిళలు సముద్రపు నాచు, చేపల ఉత్పత్తులను పెంచి ఉపాధి పొందేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. తీరప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా శనివారం మూలపొలంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబునాయుడు అధికారులతో మాట్లాడి డ్వాక్రా మహిళల ఆర్థిక ప్రగతిపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని జై హనుమాన్ స్వయంశక్తి డ్వాక్రా సంఘానికి చెందిన ఈరోతు ఊర్వశితో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడారు. తాము సంఘంలో చేరిన తర్వాత మొత్తం రుణం తీసుకుని జీవనోపాధికి వినియోగిస్తున్నానని ఊర్వశి సీఎం చంద్రబాబుకు తెలిపారు. సముద్రపు నాచు, పీతలు, రొయ్యల పెంపకంపై అధికారులు అవగాహన కల్పించారన్నారు. తమ గ్రామంలో 350 కుటుంబాలు ఉన్నాయని, ప్రస్తుతం 60 కుటుంబాలు సముద్రపు నాచు పెంచడానికి ముందుకువచ్చాయని వివరించారు. ఉపాధిలో భాగంగా అధికారుల సూచనలు మేరకు సముద్రపు నాచు, రొయ్యలు, పీతలు పెంపకం చేపట్టి.. ఆర్థికాభివృద్ధి సాధిస్తామన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, పక్కన సీఎంతో మాట్లాడిన ఊర్వశి

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి: కలెక్టర్

సోంపేట రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత మహిళలు వీడ్(సముద్రపు నాచు)తో ఉపాధి అవకాశాలు పొంది.. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోంపేట మండలం మూలపొలం గ్రామంలో సముద్రపు నాచు సాగు పైలెట్ ప్రాజెక్టును విజయవంతం చేశారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వర్చువల్ ద్వారా మూల పొలం మహిళా సంఘాలతో కాకినాడ నుంచి ప్రత్యేకంగా ముఖాముఖి జరిపారు. అనంతరం కలెక్టర్ స్థానిక మహిళలతో మాట్లాడారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో సీఐబీఏ, ఎన్‌వోటి సాంకేతిక సహకారంతో, సెర్ప్ భాగస్వామ్యంతో అమలు చేస్తున్న ఈ ప్రాజెక్టు ద్వారా గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వచ్చే ఈ సాగు చేపట్టేందుకు మహిళలు ముందుకు రావాలన్నారు. సాగు ఉత్పత్తులను ఉదయ్ ఆక్వా కంపెనీ యాజమాన్యం కొనుగోలు చేస్తుందన్నారు. అంతకుముందు పరిశ్రమ పరిధిలో ఉన్న చెరువులను పరిశీలించారు. అనంతరం పాలవలసలోని స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్య క్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, మత్స్యశాఖ ఉపసంచాలకులు సత్యనారాయణ, పలాస ఆర్డీవో వెంకటేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీకూర్మనాథుడి ఆభరణాలపై కదలిక


శ్రీకూర్మనాథ ఆలయం

- సింహాచలం నుంచి తెచ్చేందుకు ఏర్పాట్లు
- ఇక్కడే లాకర్‌లో భద్రపరిచేలా చర్యలు

గార, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం.. శ్రీకూర్మనాథుడికి ఏళ్ల కిందట దాతలు సమకూర్చిన బంగారు ఆభరణాలపై ఎట్టకేలకు కదలిక వచ్చింది. శ్రీమహావిష్ణువు దశావతారాల్లో రెండో అవతారంగా వెలసిన శ్రీకూర్మక్షేత్రాన్ని దేవతలు ప్రతిష్ఠించినట్టు చరిత్ర చెబుతోంది. రాజుల కాలంలో పలువురు స్వామికి సమర్పించిన భూములు, కానుకలకు సంబంధించి శాసనాల్లో పొందుపరిచారు. విజయనగరం గజపతులు ఈ దేవస్థానానికి వంశపారంపర్య ధర్మకర్తలుగా వ్యవహరిస్తున్నారు.

- శ్రీకూర్మనాథుడికి సుమారు మూడు కిలోల బంగారు ఆభరణాలు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ఆభరణాలను దశాబ్దాల కిందట స్వామికి జరిగే వివిధ ప్రత్యేక ఉత్సవాల్లో అలంకరించేవారు. అప్పట్లో విలువైన బంగారు ఆభరణాలు ఇక్కడ భద్రపర్చడానికి అనువైన లాకర్లు అందుబాటులో లేవు. దీంతో 1978లో అప్పటి దేవాలయ అధికారులు ఈ ఆభరణాలను సింహాచలం దేవస్థానంలో భద్రపరిచారు. అప్పటి నుంచి స్వామికి జరిగే డోలోత్సవం, కల్యాణం, మొదలైన ప్రత్యేక ఉత్సవాల్లో ఇక్కడ ఉన్న వెండి ఆభరణాలను అలంకరిస్తున్నారు. ఇటీవల ఈ ఆలయాన్ని వంశపారంపర్య ధర్మకర్తగా వ్యవహరిస్తున్న కేంద్రమాజీ మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరావు సందర్శించారు. స్వామికి ఆభరణలు అలంకరణ లేకపోవడం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని దేవదాయశాఖ అధికారులను అడగ్గా.. సింహాచలం దేవస్థానంలో భద్రపరిచినట్టు తెలిపారు. దీనిపై అశోక్‌గజపతిరాజు (మిగతా 4వ పేజీలో..)

విధులకు హాజరైన డిప్యూటీ ఎంపీడీవో


విధుల్లో డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతబొమ్మాళి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ శనివారం మండల పరిషత్‌లో విధులకు హాజరయ్యారు. జూలై 15న మండల డిప్యూటీ ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణ జిల్లాలోని ఓ రాజకీయ నాయకుడి వద్ద పీఏగా పనిచేస్తున్నానని చెబుతూ విధులకు డుమ్మా కొడుతున్నారు. వారానికి ఒక్కసారే వస్తూ హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై శనివారం 'ఈ సారు.. వారానికి ఒక్కసారే వస్తారు' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై డీపీవో కార్యాలయం నుంచి ఆరా తీసినట్టు తెలిసింది. దీంతో ఉలిక్కిపడిన డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ శనివారం విధులకు హాజరై.. సాయంత్రం వరకు కార్యాలయంలోనే ఉన్నారు. కాగా.. మండలంలో 34 పంచాయతీల్లో వీధిలైట్లు, పారిశుధ్యం, చెత్త నుంచి సంపద.. ఇతర అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షించాల్సి ఉన్నా.. ఆ దిశగా డిప్యూటీ ఎంపీడీవో చర్యలు చేపట్టలేదు. విధుల్లో చేరినప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సక్రమంగా విధులకు హాజరై పంచాయతీల పాలన పర్యవేక్షించాలని మండలవాసులు కోరుతున్నారు.

వ్యసనాలకు బానిసై దొంగలుగా మారి..



- ద్విచక్రవాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు
- రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు

వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

6లో

రాళ్లు తేలి.. గోతులు పడి

- అసంపూర్తిగా వదిలేసిన రహదారి
- రాకపోకలకు ఇబ్బంది
- బిల్లులు అందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

6లో


జి.సిగడాం: ప్రైవేటు దుకాణం వద్ద యూరియా కోసం రైతుల నిరీక్షణ


టెక్కలి: రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

యూరియా కోసం పాట్లు

- ఎరువులు సక్రమంగా అందక రైతుల ఆందోళన
- ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు

టెక్కలి/జి.సిగడాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఖరీఫ్‌లో లక్షలాది ఎకరాల్లో వరిసాగు చేపడుతుండగా.. ఎరువులు సక్రమంగా అందక ఆందోళన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. శనివారం వివిధ గ్రామాల నుంచి టెక్కలి చేరుకున్న రైతులు ఎరువుల దుకాణాల యజమానుల తీరును నిరసిస్తూ ఆందోళన చేశారు. కొంతమంది వ్యాపారులు అధిక ధరకు విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలో ఆర్డీవో కృష్ణమూర్తికి వివరించారు. దీంతో ఆర్డీవోతోపాటు వ్యవసాయశాఖ ఏడీ జగన్‌మోహనరావు, వ్యవసాయశాఖ అధికారులు ఎరువులు దుకాణాల వద్దకు చేరుకుని విక్రయాలపై ఆరా తీశారు. అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీఐ విజయ్ కుమార్‌తో పాటు సిబ్బంది అక్కడకు చేరుకొని బందోబస్తు నిర్వహించారు. శనివారం సాయంత్రం వరకు రైతులకు ఎరువులను అందజేశారు.

- జి.సిగడాంలో కూడా రైతులు ఎరువుల కోసం (మిగతా 4వ పేజీలో..)

అధికారుల ఆకస్మిక తనిఖీలు

కాశీబుగ్గ/ గార రూరల్/ శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎరువుల దుకాణాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం కాశీబుగ్గలో ఓ ఎరువుల దుకాణాన్ని పలాస ఆర్డీవో జి.వెంకటేష్, కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ వేణుగోపాలరావు, పలాస వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.రామారావు తనిఖీ చేశారు. గోదాములో ఉన్న ఎరువులు, రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో జి.వెంకటేష్ మాట్లాడుతూ.. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

- శ్రీకూర్మంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డీవీవీ సతీష్ ఆకస్మికంగా తనిఖీ (మిగతా 4వ పేజీలో..)

పరిశ్రమల్లోనూ తనిఖీ

రణస్థలం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో ముడిసరుకుగా వినియోగిస్తున్న యూరియా ఎక్కడి నుంచి దిగుమతి అవుతుందనే అంశంపై అధికారులు శనివారం రణస్థలం మండలంలోని పలు పరిశ్రమల్లో తనిఖీ చేపట్టారు. వనం ప్లైఉడ్ ఇండస్ట్రీస్, త్రిమూర్తి ప్యానెల్ ప్రొడక్ట్స్, బంటుపల్లి యూబీ పరిశ్రమల్లో తనిఖీ చేశారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ సీహెచ్ వివేకానంద, తహసీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్, సీఐ ఎం.అవతారం, ఎస్ఐ ఎస్.చిరంజీవి, వ్యవ సాయాధికారులు పరిశ్రమలను సందర్శించి అక్కడి సిబ్బందితో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


రణస్థలం: ప్లైఉడ్ పరిశ్రమను తనిఖీ చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో సాయిప్రత్యూష

కొత్త మాస్టార్లు

- ప్రతిభ చూపిన జిల్లా యువత
- ఉపాధ్యాయ ఉద్యోగాలకు అర్హత

మెగా డీఎస్సీలో జిల్లా యువత మంచి ప్రతిభ కనబరిచారు. తమ ఆశయాన్ని నెరవేర్చుకోవడంతో పాటు తల్లిదండ్రుల కలలు నిజం చేశారు. కొందరు తాము అనుకున్న పోస్టులకు అర్హత సాధిస్తే..మరికొందరు ఒకేసారి మూడు నాలుగు విభాగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో మంచి ర్యాంకులు సాధించారు.

రాంబాబుకు మొదటి ర్యాంకు..


హరిబాబు


రాంబాబు


సత్యనారాయణ

జి.సిగడాం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆనందపురం గ్రామానికి చెందిన గురుగుబిల్లి రాంబాబు ఎస్ఏ బయోలజీలో 88.57 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్, జిల్లాలో మొదటి ర్యాంక్ సాదించాడు. తల్లిదండ్రులు లక్ష్మి, సూర్యారావులు వ్యవసాయ కూలీలు. తమ కుమారుడు ప్రయోజకుడు కావాలనే లక్ష్యంతో తమ శ్రమని, కష్టార్జితాన్ని పోగుచేసి ఉన్నత చదువులు చదివించారు. బిడ్డకు ఉద్యోగం రావడంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. నడిమివలసకు చెందిన బాలి సత్యనారాయణ స్కూల్ అసిస్టెంట్ (సోషల్)లో 86.69 మార్కులతో జిల్లాలో 5వ ర్యాంక్ సాధించారు. గెడ్డకంచరాం గ్రామానికి చెందిన నక్క హరిబాబు డీఎస్సీలో నాలుగు పోస్టులకు అర్హత సాధించాడు. పీజీటీ జోన్-1లో రెండో ర్యాంక్, టీజీటీ జోన్-1లో మూడో ర్యాంక్, స్కూల్ అసిస్టెంట్‌లో 4వ ర్యాంక్, టీజీటీ సైన్స్ జోన్-1లో 13వ ర్యాంక్ సాధించారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో శివాజీకి రెండో ర్యాంక్...


పిలక శివాజీ

సంతబొమ్మాళి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): బోరుభద్ర పంచాయతీ గొదలాంకు చెందిన పిలక శివాజీ ఫిజికల్ ఎడ్యుకేషన్ (పీడీ) విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్ సాధించారు. ఆయన 90 మార్కులు సాధించి జిల్లాలో రెండో స్థానంలో నిలిచారు.

ఫిజిక్స్‌లో మొదటి ర్యాంక్


మొదటిర్యాంకర్ శంకరరావును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హరిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): అంబుగాం గ్రామానికి చెందిన మజ్జి శంకరరావు సూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. టీజీటీలోనూ జోన్-1లో ఫిజిక్స్ విభాగంలో నాలుగో ర్యాంకు సాధించారు. దీంతో అంబుగాం పాఠశాలలో శనివారం శంకరరావును ఉపాధ్యాయులు అభినందించారు.

సురేంద్రకు మూడు విభాగాల్లో...


పి.సురేంద్ర బాబు

కవిటి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): శిలగాం గ్రామానికి చెందిన పిరియా సురేంద్రబాబు ఎస్ఏ (సోషల్)లో జిల్లా స్థాయిలో 4వ ర్యాంకు, జోన్-1లో పీజీటీలో 7, టీజీటీలో 8వ ర్యాంక్ సాధించారు. భైరిపురం గ్రామానికి చెందిన పిరియా షర్మిల కర్నూలు జిల్లాలో ఓపెన్ కేటగిరీలో ఉద్యోగానికి ఎంపికయ్యారు.

కంచిలి మండలంలో...


సచిన్‌కుమార్


దేబాశిష్ బిసాయికి స్వీట్ తినిపిస్తున్న కుటుంబ సభ్యులు


ఎస్.సౌమ్య

కంచిలి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముండల గ్రామానికి చెందిన సచిన్ కుమార్ మహంతి ఒరియా ఎస్జీటీలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. కంచిలికి చెందిన ఎస్.సౌమ్య ఎస్ఏ ఇంగ్లిష్‌లో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. డోలగోవిందపురం గ్రామానికి చెందిన దేబాశిష్ బిసాయి ఒరియా ఎస్జీటీ విభాగంలో ఏడో ర్యాంకు సాధించాడు.

ఒకేసారి నాలుగు విభాగాల్లో...

ముండల గ్రామానికి చెందిన సచిన్ కుమార్ మహంతి ఒకేసారి నాలుగు విభాగాల్లో ఉపాధ్యాయుడిగా అర్హత సాధించారు. ఒరియా ఎస్జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు, ఒరియా స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రంలో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. టీజీటీ లెక్కలు విభాగంలో జోనల్ స్థాయిలో ఏడో ర్యాంకు, పీజీటీ భౌతిక శాస్త్రంలో జోనల్ స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు.

సతీష్‌కు 3వ ర్యాంక్


బనిశెట్టి సతీష్

జలుమూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట గ్రామానికి చెందిన బనిశెట్టి సతీష్ ఫిజిక్స్ విభాగంలో జిల్లాలో 3వ ర్యాంకు సాధించారు. ఆయనకు 84.2 మార్కులు వచ్చాయి. ఆయన తండ్రి అప్పలరాజు 4 ఏళ్ల క్రితం మృతి చెందారు. ప్రైవేటు స్కూలులో టీచరుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ డీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటాడు. తల్లి మహాలక్ష్మి ఉన్నారు. గొల్లపేట గ్రామానికి చెందిన తాన్ని మన్మథరావు రాష్ట్రస్థాయిలో 95వ ర్యాంకు సాధించాడు.

అనూరాధకు నాలుగో ర్యాంకు


మంతిని అనూరాధ

ఎచ్చెర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఫలితాల్లో ఎచ్చెర్లకు చెందిన మంతిని అనూరాధ ఎస్జీటీలో 92.24623 మార్కులతో జిల్లాలో నాలుగో ర్యాంకు సాధించారు. మంతిని రమణ, రమణమ్మ దంపతుల పెద్ద కుమార్తె అయిన అనూరాధ రెండో ప్రయత్నంలో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారు. తండ్రి రమణ ఇక్కడికి సమీపంలోని ఓ పరిశ్రమలో, తల్లి రమణమ్మ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నారు.

రవికుమార్‌కు మొదటి ర్యాంక్


రవికుమార్

నందిగాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నందిగాంకు చెందిన పిన్నింటి రవికుమార్ జోన్ స్థాయిలో పీజీటీ ఇంగ్లిష్ విభాగంలో మొదటి ర్యాంకు, జిల్లా స్థాయిలో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ విభాగంలో ఐదో ర్యాంకు సాధించాడు. ఆయన విశాఖ నేవీ స్కూల్‌లో టీజీటీగా పని చేస్తున్నారు.

పీజీటీ గణితంలో రెండో ర్యాంక్


ధనుంజయరావు

గార, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఆరంగిపేటకు చెందిన ఆరంగి ధనుంజయరావు పీజీటీ మ్యాథ్స్ విభాగంలో జోన్ -1లో రెండో ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు.

తెలుగు విభాగంలో ఐదో ర్యాంక్

మెళియాపుట్టి,ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కొత్తమారడికోట గ్రామానికి చెందిన మజ్జి శైలజ జిల్లాలో స్కూల్ అసిసెంట్ (తెలుగు) విభాగంలో ఐదో ర్యాంకు సాధించారు. మహిళల కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచారు. ఆమె భర్త ఖగేశ్వరరావు ప్రస్తుతం మెళియాపుట్టి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

ఇద్దరికి మొదటి ర్యాంకులు


హరీష్


ఢిల్లేష్

ఇచ్ఛాపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): రత్తకన్న గ్రామం మంగళకాలనీకి చెందిన బల్లోజు హరీష్ ఆచారి టీజీటీ-సివిక్స్‌లో 76.5 మార్కులతో రాష్ట్రంలో మొదటి ర్యాంకు, టీజీటీ-సోషల్‌లో 83.47 మార్కులతో రాష్ట్రంలో 5వ ర్యాంకు, పీజీటీ- సోషల్‌లో 74.5 మార్కులతో 6వ ర్యాంకు, ఎస్ఎ-సోషల్‌లో 88.53మార్కులతో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. ఆంధ్రా సమీప ఒడిశా జయంతిపురం గ్రామానికి చెందిన బొమ్మిడి ఢిల్లేష్ టీజీటీ-సోషల్ స్టడీస్‌లో 84.20మార్కులతో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంక్, పీజీటీ -సివిక్స్‌లో 69మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండు, పీజీటీ సోషల్‌లో 74.5 మార్కులతో 5, ఎస్ఏ-సోషల్‌లో 83.72 మార్కులతో జిల్లా స్థాయిలో 9వ ర్యాంక్ సాధించారు.

దేవీ ప్రసాద్‌కు 3వ ర్యాంకు


దేవీప్రసాద్‌కు స్వీట్స్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

లావేరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తాళ్లవలసకు చెందిన పిసిని దేవీవర ప్రసాద్ బయోలజీలో జిల్లా స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. ఆయనకు 85.6 మార్కులు వచ్చాయి.

మూడు విభాగాల్లో ప్రియాంక ప్రతిభ


ప్రియాంక

హిరమండలం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): హిరమండలానికి చెందిన గుర్రాల ప్రియాంక మూడు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్‌లో 81.09 మార్కులతో జిల్లా స్థాయిలో 7వ ర్యాంకు సాధించారు. పీజీటీలో 74 మార్కులో జోన్-1లో 24వర్యాంకు, టీజీటీలో 75.59 మార్కులతో జోన్-1లో 42వ ర్యాంకు సాధించారు. ఆమె భర్త అల్లాడ రాజశేఖర్ భగీరథపురం హైస్కూల్‌లో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి పదేళ్ల, ఎనిమిదేళ వయస్సు కలిగిన ఇద్దరు పిల్లలు ఉన్నారు.

శ్రీకూర్మనాథుడి ఆభరణాలపై కదలిక

(మూడో పేజీ తరువాయి)

స్పందిస్తూ అక్కడి నుంచి ఆభరణాలు తెప్పించి కూర్మనాథుడికి ఉత్సవాల సమయంలో అలంక రించాలని తెలిపారు. వాటిని ఇక్కడే లాకర్ ఏర్పాటు చేసి భద్రపరచాలని దేవదాయశాఖ అధికా రులను ఆదేశించారు. సింహాచలం నుంచి బంగారు ఆభరణాలను తెప్పించేందుకు దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీకూర్మంలో లాకర్ ఏర్పాటు కోసం బ్యాంకు అధికారులను సంప్ర దించారు. త్వరలో శ్రీకూర్మనాథ క్షేత్రానికి ప్రత్యేక భద్రత నడుమ బంగారు ఆభరణాలు రానున్నాయి.

లేఖ రాశాం..

కేంద్ర మాజీ మంత్రి, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అశోక్‌గజపతిరాజు ఆదేశాల మేరకు శ్రీకూర్మనాథుని బంగారు ఆభరణాలు అప్పగించాలని కోరుతూ సింహాచలం దేవస్థానం అధికారులకు ఇటీవల లేఖ రాశాను. ఆభరణాలు అప్పగిస్తే శ్రీకూర్మంలో భద్రపరిచేందుకు చర్యలు తీసుకుంటాం. బ్యాంకులో ఒక లాకర్ ఉంచాలని అధికారులను కూడా కోరాం.

-ఎం.నరసింహనాయుడు, ఈవో, శ్రీకూర్మం

యూరియా కోసం పాట్లు

(మూడో పేజీ తరువాయి)

ప్రైవేటు దుకాణం వద్ద బారులుదీరారు. ఇటీవల సచివాలయంలో పాస్‌పుస్తకానికి ఒక యూరియా బస్తా ఇచ్చారని రైతులు పేర్కొన్నారు. ఇప్పుడు సచివాలయాలకు యూరియా రావడం లేదని, ప్రైవేటు దుకాణాల వద్ద గంటలకొద్దీ నిరీక్షించినా యూరియా దొరకడం లేదని ఆవేదన చెందుతున్నారు. రాజాంలో ప్రైవేటు దుకాణాల వద్ద కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొందని పెంట, నాగులవలస, సీతంపేట తదితర గ్రామాల రైతులు వాపోయారు.

డీఎస్సీలో సిక్కోలు సత్తా

(మూడో పేజీ తరువాయి)

సీహెచ్.భారతి 85.25 మార్కులతో రెండోస్థానం, నక్క అరుణ 78.10 మార్కులతో మూడోస్థానం, జి. ధనలక్ష్మి 76.20 మార్కులతో నాల్గోస్థానం సాధించారు.

- స్కూల్ అసిస్టెంట్ ఒరియా విభాగంలో 16 మంది పరీక్షలు రాశారు. జి.సంతోష్ 79.90 మార్కులు, ఎస్.మోజ్జి 78.10 మార్కులతో మొదటి రెండు స్థానాలు పొందారు.
- స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 1735 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా.. జీరు సత్యనారాయణ 90.21 మార్కులతో మొదటిస్థానం, పి.ధర్మారావు 88.01 మార్కులతో ద్వితీయస్థానం, ఆర్.షణ్ముఖరావు 87.66 మార్కులతో తృతీయస్థానం, జి.శంకరరావు 84.04 మార్కులతో నాల్గోస్థానం సాధించారు.
- బయాలజీ విభాగంలో 1,880 మంది పరీక్షలు రాశారు. వీరిలో గరుగుబిల్లి రాంబాబు 88.57మార్కులతో మొదటిస్థానం, కనకపల్లి మహేష్‌బాబు 86.36 మార్కులతో ద్వితీయస్థానం, పిసిని దేవప్రసాద్ 85.60 మార్కులతో తృతీయస్థానం పొందారు.
- స్కూల్ అసిస్టెంట్ గణితంలో 2,684 మంది అభ్యర్థులు పరీక్షలు రాయగా, కుశెట్టి ఈశ్వరరావు 88.80 మార్కులతో ప్రథమస్థానం, వీ.వై.మల్లేశ్వరరావు 87.82 మార్కులతో ద్వితీయస్థానం, వెంకటనవ్య 87.64 మార్కులతో తృతీయస్థానం పొందారు.
- ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 1,362 మంది పరీక్షలు రాశారు. వీరిలో దుబ్బ హరికృష్ణ 90.5 మార్కులతో ప్రథమస్థానం, పిలక శివాజీ 90 మార్కులతో ద్వితీయ స్థానం, బొకెల శ్రీనాథ్ 89.5 మార్కులతో తృతీయస్థానం సాధించారు.
- ఫిజికల్ సైన్స్ విభాగంలో 976 మంది పరీక్షలు రాశారు. మొజ్జ శంకరరావు 86.74 మార్కులతో ప్రథమస్థానం, సుంకర అప్పన్న 84.32 మార్కులతో ద్వితీయస్థానం, బినిశెట్టి సతీష్ 84.20 మార్కులతో తృతీయస్థానం సాధించారు.
- స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 2,976 మంది పరీక్షలకు హాజరయ్యారు. కూర్మాన నిరోష 89.55 మార్కులతో మొదటిస్థానం, పెండి బాలకృష్ణ 88.89 మార్కులతో ద్వితీయస్థానం, బొజ్జ హరిష్ 88.53 మార్కులతో తృతీయస్థానం సాధించారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు ఇవి తప్పనిసరి..

ఒరిజనల్ ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, పీజీ, బీఈడీ, డీఈడీ, బీపీఈడీ, పండిట్ ట్రైనింగ్ సర్టిఫికెట్లతో అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలి. వీటితోపాటు కుల ధ్రువీకరణ, డిజెబుల్డ్ సర్టిఫికెట్, మూడో తరగతి నుంచి స్టడీ సర్టిఫికెట్లు, టెట్ మార్కుల కాపీ, డీఎస్సీ హాల్ టికెట్ కాపీ, ఆధార్ కార్డు, 5 పాస్‌పోర్టు సైజుఫోటోలు ఉండాలి. సర్టిఫికెట్లన్నింటినీ అటెస్టేషన్ చేయించి (3 సెట్లు) ఒరిజనల్స్‌తో సహా పరిశీలనకు హాజరు కావాలి. అభ్యర్థికి సహాయకులుగా ఒక వ్యక్తిని అనుమతిస్తారు. వెబ్‌సైట్‌లో లాగిన్ అయి అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లను స్కాన్‌చేసి అప్‌లోడ్ చేయాలి. విద్యాశాఖ అధికారుల సూచనలు మేరకు ఏర్పాట్లు చేశామని డీఈవో రవిబాబు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన తదితర అంశాలకు సంబంధించి షెడ్యూల్ రావాల్సి ఉందన్నారు.

అధికారుల ఆకస్మిక తనిఖీలు

(మూడో పేజీ తరువాయి)

చేశారు. విజయలక్ష్మి ట్రేడర్స్‌లో ప్రస్తుతం ఉన్న నిల్వలకు ఈ-పాస్ యంత్రంలో ఉన్న నిల్వకు తేడా ఉన్నట్టు గుర్తించారు. 118 డీఏపీ, 235 పొటాష్, 105 సూక్ష్మ పోషక ఎరువులు, 64 అన్నదాత ఎరువుల బస్తాలను సీజ్ చేసి అమ్మకాలను నిలుపుదల చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మకాలు చేపట్టాలని, కృత్రిమ కొరత సృష్టించవద్దన్నారు.


కాశీబుగ్గ: ఎరువుల గోదామును పరిశీలిస్తున్న అధికారులు

- శ్రీకాకుళం మండలం కిల్లిపాలెంలో ఎరువుల దుకాణాలు, శ్రీకాకుళంలో గ్రోమోర్, తండేంవలసలో ఆదిత్య ఎరువుల షాపులను విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. నిల్వలను పరిశీలించారు. తనిఖీల్లో విజిలెన్స్ సీఐ డీవీవీ సతీష్ కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎర్రన్నాయుడు, వ్యవసాయాధికారి పి.నవీన్ పాల్గొన్నారు.

‘అన్నదాత సుఖీభవ’తో ఇళ్లల్లో వెలుగులు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

హరిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ యోజన పథకాలు రైతుల ఇళ్లల్లో వెలుగులు నింపుతున్నాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మందస మండలం సువర్ణాపురం గ్రామంలో ఆయన శనివారం రైతులతో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులు సంతోషం వ్యక్తం చేయటంతో సంతృప్తి చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పథకం అందేలా చూడాలని సచివాలయ, రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. అనంతరం గ్రామంలో విద్యార్థులతో ముచ్చటించి బోధనా తీరు, తరగతుల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థినితో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్

ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం, స్టూడెంట్ కిట్‌లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృధ్వీరాజ్ కుమార్, తహశీల్దార్ ఎం.శ్రీకాంత్, డీటీ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

29 నుంచి మగ్గం వర్క్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో మహిళలకు మగ్గం వర్క్‌పై ఈ నెల 29 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, ఈ కాలంలో ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శారీస్, బ్లౌజులు, డ్రెస్సుల పై డిజైన్స్ నేర్పిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 19-45 ఏళ్ల లోపు వయసు ఉన్న మహిళలు మాత్రమే ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.


కోలాటం కళాకారులతో స్వామీజీలు

ముగిసిన జ్ఞాన ప్రవచన యజ్ఞం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): కోపం జీవితాలకు శాపమని, దానికి దూరంగా ఉండేలా పాటుపడాలని చిన్మయి మిషన్ వ్యవస్థాపకులు చిద్రూపానంద సరస్వతి అన్నారు. బాపూజీ కళామందిరంలో నిర్వహిస్తున్న జ్ఞాన ప్రవచన యజ్ఞం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. సత్యం పలకడం, జాతి మత, దేశ, ప్రాంత భేదాలు లేకుండా అందరినీ సమానం చూడడం కనీస ధర్మాలన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారుల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కళాకారులను స్వామి చిద్రూపానంద, స్వామి పరమాత్మానంద అభినందించారు. కార్యక్రమంలో నిష్టల నరసింహమూర్తి, అంధవరపు ప్రసాద్, రామకృష్ణ, నిక్కు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం


బరువు ఎత్తుతున్న నారా వెంకటేష్

పలాస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గకు చెందిన న్యాయవాది నారా వెంకటేష్‌కు జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం వరించింది. ఈ నెల 18న జంషెడ్‌పూర్‌లో జాతీయ సీనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. దేశ వ్యాప్తంగా 20 రాష్ట్రాల నుంచి 900 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లా నుంచి వెంకటేష్ హాజరయ్యారు. 120 కిలోల విభాగంలో మొత్తం 500 కిలోల బరువు ఎత్తి ప్రథమ స్థానం సాధించారు. ప్రస్తుతం ఆయన చిన్నబడాం గ్రామంలో నివాసం ఉంటూ పలాసలో న్యాయవాద వృత్తిలో స్థిరపడ్డారు. వెంకటేష్ సోదరుడు నారా ప్రసాద్ కూడా జాతీయ స్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించారు. వెంకటేష్ బంగారు పతకం సాధించడం పట్ల పలాస బార్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

ఆంధ్రకేసరి పోరాటం స్ఫూర్తిదాయకం


టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు పోరాటం స్ఫూర్తిదాయకమని, నీతి, నిజాయితీ, విలువలకు కట్టుబడి జీవనం సాగించారని వక్తలు అన్నారు. టంగుటూరి 153వ జయంతి సందర్భంగా స్థానిక గాంధీ స్మృతివనంలో టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిం చారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకుల దురాగతాలకు తన గుండెను ఎదురొడ్డిన ధీశాలి టంగుటూరి అన్నారు. న్యాయవాదిగా సంపాదించిన ఆస్తిని స్వాతంత్ర్య ఉద్య మానికి అందించిన దాత అని కొనియాడారు. ఆయన మార్గాన్ని అనుసరించడం ద్వారా పోరాట స్ఫూర్తి పొందాలని కోరారు. కార్యక్రమంలో మందిరం ప్రతినిధులు జామి భీమశంకర్, వావిలపల్లి జగన్నాథంనాయుడు, చౌదరి రాధాకృష్ణ, డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పండితులు పైడి హరనాథరావు, నిష్టల నరసింహమూర్తి, నటుకుల మోహన్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతంటూ ఆందోళన

- మాజీ స్పీకర్, తనయుడు ఓవరాక్షన్
- సీతారాంను అదుపులోకి తీసుకున్న పోలీసులు



మాజీ స్పీకర్ తమ్మినేనిని వాహనం ఎక్కిస్తున్న పోలీసులు

ఆమదాలవలస, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరతంటూ వైసీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మి నేని సీతారాం, ఆయన తనయుడు చిరంజీవి నాగ్ శనివారం హల్‌చల్ చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి సీతారాంను సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. గుజరాత్ రాష్ట్రం సూరత్ క్రిబ్‌కో యూరియా కంపెనీ నుంచి సుమారు 1500 మెట్రిక్ టన్నుల యూరియా స్థానిక రైల్వేస్టేషన్‌కు శనివారం చేరుకుంది. గూడ్స్‌లో వచ్చిన యూరియాను జిల్లా అధికారులు పరిశీలించి శ్రీకాకుళం జిల్లాకు 1100 మెట్రిక్ టన్నులు, విజయనగరం జిల్లాకు 150 మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించినట్టు తెలిసింది. రైల్వేస్టేషన్‌కు గూడ్స్ వ్యాగన్ యూరియాతో వచ్చిందని ఆమ దాలవలస మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉందంటూ వైసీపీ నాయకులు ఆ ప్రాంతానికి చేరుకుని ధర్నా చేసేందుకు సిద్ధపడ్డారు. ముందుగా తమ్మినేని తనయుడు చిరంజీవి నాగ్ అక్కడికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు అక్కడి నుంచి పంపించారు. వ్యవసాయాధికారి సమాధానం చెప్పాలని ఆయన పట్టుబడడంతో ఏవో మోహన్‌రావు మండలానికి 654 మెట్రిక్ టన్నులు కేటాయించాల్సి ఉండగా ఇప్పటికే 576 మెట్రిక్ టన్నులు రైతు సేవా కేంద్రాలకు, 342 మెట్రిక్ టన్నులు ప్రైవేటుకు కేటాయించామన్నారు. ఆ తరువాత మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం గూడ్స్ గోడౌన్ వద్దకు వెళుతున్న సమయంలో ఆమదాలవలస గేటు ప్రాంతంలో ఉన్న పెట్రోల్ బంకు వద్ద సీఐ సత్య నారాయణ, సరుబుజ్జిలి, ఆమదాలవలస, బూర్జ ఎస్ఐలు హైమావతి, కాంతారావు, లావణ్య ఆయనను అడ్డుకు న్నారు. వారితో సీతారాం వాదన కుదిగారు. తిరిగి బైక్‌పై మళ్లీ గూడ్స్ గోడౌన్ వద్దకు బయలు దేరడంతో పోలీసులు మళ్లీ నిలువరించారు. ఆ సమయంలో పోలీసులకు తమ్మినేని, ఆయన అనుచరులకు వాగ్వాదం జరిగింది. చివరకు తమ్మినేనిని పోలీసులు అదుపులోకి తీసుకుని జీపులో ఎక్కించి అయన ఇంటికి తరలించి గృహనిర్బంధం చేశారు. అయితే ఎరువుల కొరతపై ధర్నా చేసేందుకు తమ్మినేని పిలుపునిచ్చినప్పటికీ రైతుల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు.

ఆదిత్యాలయ క్షురకుడి సస్పెన్షన్

అరసవల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్య నారాయణ స్వామివారి ఆలయం కేశఖండన శాలలో పనిచేస్తున్న ఓ క్షురకుడిని సస్పెండ్ చేస్తూ ఈవో కేఎన్‌వీడీవీ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. విశాఖపట్నం నుంచి స్వామివారి దర్శనానికి వచ్చిన తననుంచి అదనపు సొమ్ము విషయంలో ఆ క్షురకుడు వాదనకు దిగిన విషయాన్ని ఆ భక్తుడు నేరుగా కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ఈవో భవిష్యత్‌లో మరెవరూ ఇటువంటి చర్యలకు పాల్పడకుండా వారం రోజుల పాటు విధుల నుంచి సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించినా, ఎవరైనా అక్రమ వసూళ్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని ఈవో ప్రసాద్ తెలిపారు.

తేనెటీగల పెంపకంతో ప్రయోజనం

కవిటి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): తేనెటీగల పెంపకంతో రైతులు ప్రయోజనం పొందవచ్చని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో తేనెటీగల పెంపకంపై ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం బి.నారాయణరావు, ఈశ్వరరావు, గోవిందరావు, ఎ.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో ఎరువులు అందించండి

ఇచ్ఛాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణం అందజేసి ఆదుకోవాలని జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ కోరారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైసీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ.. ఎరువుల కోసం రైతులు ఆందోళన చెందుతున్నా వారి గోడు కూటమి నేతలకు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ బోర పుష్ప, వైసీపీ నేతలు పాల్గొన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోండి

శ్రీకాకుళం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై ప్రతి ఒక్కరూ వినియోగించు కోవాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. కళ్లేపల్లి గ్రామంలో శనివారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు వద్ద బీమా పాలసీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పలువురు లబ్ధిదారులకు బీమా పాలసీ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, కూటమి నేతలు, స్థానికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలి

ఎచ్చెర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు అన్నారు. ఎచ్చెర్లలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. డీఏ, పీఆర్‌సీ అమలు లేదని, సంక్షేమ పథకాలు కూడా వర్తింపజేయడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.విజయలక్ష్మి, చంద్రమౌళి, యు.శారద, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

అరసవల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏడు రోడ్ల కూడలిలో ఉన్న ఎన్టీఆర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూల్‌కు పూర్వ విద్యార్థులు మెటీరియల్‌ను అందించారు. ఇదే పాఠశాలలో 1961-1971 మధ్య చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.20 వేలు విలువ చేసే చిల్డ్రన్ కంటెంట్ స్పోర్ట్స్, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, క్యారం, చెస్ బోర్డు, డిక్షనరీలు, ఫ్లాష్ కార్డులను హెచ్‌ఎం భరద్వాజ్‌కు శనివారం అందజేశారు. పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

స్వచ్ఛాంధ్రలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలి

స్వచ్ఛాంధ్రలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యేలు అన్నారు. శనివారం పలు ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహిం చారు. ర్యాలీలు, అవగాహన సదస్సులు చేపట్టారు.



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర ప్రతీ ఒక్కరి లక్ష్యం కావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలోని డీసీసీబీ కాలనీలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నగరాన్ని ఆరోగ్యంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఎచ్చెర్లను సాధిద్దాం: ఎన్ఈఆర్

ఎచ్చెర్ల, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఎచ్చెర్లను సాధించే దిశలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఎచ్చెర్లలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇళ్లతో పాటు పరిసరాలు, కార్యాలయాల్లో పరిశుభ్రత పాటించా లన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. అధికారులు, విద్యార్థులు, కూటమి నేతలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ అన్నెపు భువనేశ్వరరావు, నారాయణపురం ప్రాజెక్ట్ కమిటీ ఉపాధ్యక్షుడు పంచిరెడ్డి కృష్ణారావు, కూటమి నేతలు బెండు మల్లే శ్వరరావు, సంపతిరావు నాగేశ్వరరావు, మెండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత: బగ్గు

నరసన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర నిర్వహించారు. మొక్కలు నాటి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ ప్రసాద్, ఐడీసీఎస్ పీవో శోభారాణి, ఏవో సూర్యకుమారి, మేజర్ పంచాయతీ ఈవో ద్రాక్షాయిణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణంనాయుడు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పాగోటి ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు



పంచాయతీ కార్మికులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సమయపాలన పాటించాలి

ఇచ్ఛాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మద్యం బార్ల నిర్వాహకులు సమ య పాలన తప్పనిసరిగా పాటించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. లైసెన్సుదారులు, అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. కొత్త మద్యం బార్లకు ఈనెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని, అదేరోజు శ్రీకాకుళం అంబేడ్కర్ హాలులో కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీయడం జరుగుతుంద న్నారు. ఇచ్ఛాపురంలో కొత్తగా మరో రెండు మద్యంబార్లకు దరఖాస్తు లు చేసుకో వచ్చన్నారు. ఒక వ్యక్తి ఎన్ని బార్లకైనా దరఖాస్తులు చేసుకోవచ్చ న్నారు. లైసెన్సు పొందిన వారు బ్యాంక్ గ్యారెంటీతో ఆరు సమాన వాయి దాలతో చెల్లించవచ్చన్నారు. ఒకే బారుకు 4 దరఖాస్తులు వస్తే లాటరీ పద్ధతి ద్వారా కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో పలాస, సోంపేట ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ పట్టణ అధ్యక్షుడిగా శేఖర్

సోంపేట, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సోంపేట పట్టణ అధ్యక్షుడిగా మాజీ సర్పంచ్ చిత్రాడ శేఖర్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి నియామక పత్రం అందింది. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే అశోక్, మాజీ మంత్రి గౌతు శివాజీ, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సోంపేట కోదండరామస్వామి దేవాలయ ట్రస్టు బోర్డు చైర్మన్‌గా పట్టణానికి చెందిన బీన ఆనందరావును, పార్టీ మండల తెలుగు యువత అధ్యక్షుడిగా తామాడ పాపారావును నియమించారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

దాడుల నివారణకు చట్టాలను ఉపయోగించుకోవాలి

శ్రీకాకుళం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీలపై దాడుల నివారణకు చట్టాలను ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. శాంతినగర్ కాలనీలో శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్లలో బాధితుల నుంచి ఫిర్యాదును నమోదుచేయకుంటే వాటిని ప్రైవేటు కంప్లయింట్ ద్వారా కోర్టుల్లో దాఖలు చేయవచ్చన్నారు. ఈ చట్ట ప్రకారం ప్రతి జిల్లాలో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించి ఎస్సీ ఎస్టీల కేసుల పురోగతిపై సమీక్షించాల్సి ఉందన్నారు. పౌర హక్కుల రక్షణ చట్టం ప్రకారం వారి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని వివరించారు. హక్కులకు భంగం కలిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయాన్ని పొందవచ్చని స్పష్టంచేశారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి

కార్యక్రమంలో న్యాయవాది జి.ఇందిరా ప్రసాద్, డీసీపీవో కేవీ రమణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ మండపాల ఏర్పాటుకు సులభతరంగా ఆన్‌లైన్‌లో అనుమతులు పొంది, పోలీసు వారు ఇచ్చే నిబంధనలను పాటించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. సింగిల్‌విండో విధానంలో అనుమతులను పొందాలన్నారు. విగ్రహాలను రహదారికి అంతరాయం లేకుండా ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కమిటీ మెంబర్లు ఆధార్, అడ్రస్‌లు, ఫోన్ నెంబర్లు, విగ్రహాల ఎత్తు, బరువు, పూజా దినాలు, వినాయక నిమజ్జనం సమయాలను, రూట్ మ్యాప్‌ను తెలియజేయాలన్నారు. మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లు ఉపయోగించరాదని, సాధారణ స్పీకర్లను ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే వినియోగించాలన్నారు. ఉత్సవ మండపాల వద్ద గాని, ఊరేగింపుల్లో గాని బాణ సంచాను కాల్చవద్దన్నారు. నిమజ్జన సమయంలో అశ్లీల నృత్యాలు, డీజే సౌండ్‌లు చేయరాదని, రాజకీయ, మతపరమైన ఇతర వ్యక్తులను రెచ్చగొట్ట వద్దన్నారు. బలవంతపు చందాలు, దర్శనాలకు టిక్కెట్లు పెట్టరాదని, అటువంటి చర్యలకు పాల్పడితే వాటిపై డయల్ 100 లేక 63099 90933 నెంబర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

ఇరువర్గాల మధ్య కొట్లాటపై కేసు

ఇచ్ఛాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం మండలం ఎంతోటూరులో ఇరువర్గాల మధ్య జరిగిన కొట్లాటలో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఇన్‌చార్జి ఎస్ఐ ఎం.ముకుందరావు తెలిపారు. శనివారం గ్రామంలో కాళ్ల నీలవేణి, ఒగాడ నరసింహంమూర్తి వర్గాల మధ్య పాత కక్షల కారణంగా వివాదం చెలరేగి కొట్లాటకు దారితీసిందన్నారు. ఈ ఘటనలో ఇరువర్గాలకు చెందిన వ్యక్తులకు గాయాలయ్యాయని, ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లాకు లచ్చన్న పేరు పెట్టాలి

సోంపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదిస్తున్న పలాస జిల్లాకు స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పేరు పెట్టాలని ఇచ్ఛాపురం నియోజకవర్గ శ్రీశయన సంఘ ప్రతినిధులు కోరారు. శనివారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ను కలిసి వినతి పత్రం అందించారు. బీన ప్రదీప్, దివాకర్, మనోజ్ పాల్గొన్నారు.

అంతరిక్ష విజ్ఞానంలో పురోగతి

కవిటి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అంతరిక్ష విజ్ఞానంలో భారతదేశం పురోగతి సాధించి ముందు నిలుస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ కె.సింహాచలం నాయుడు అన్నారు. కళాశాలలో శనివారం ఎన్ ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు.

బాలికల సంపూర్ణ ఆరోగ్యానికి కృషి

అరసవల్లి, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): వసతి గృహాల్లోని బాలికల సంపూర్ణ ఆరోగ్యం కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రసూతి, స్త్రీ వైద్యుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ మేర కు శనివారం వారు డీఎంహెచ్ వో డా.అనిత, డీసీ హెచ్ఎస్ డా. కల్యాణ్ బాబులను డీఎంహెచ్‌వో కార్యాలయంలో కలిసి వివరించారు. ఈ సందర్భంగా అవగాహన బ్రోచర్లను విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖలు, కెజీబీవీ ప్రిన్సిపాళ్ల సహకారంతో వసతి గృహాల్లో ఉండే కిశోర బాలికల సంపూర్ణ ఆరోగ్యం కోసం రక్తహీనత, స్క్రీనింగ్, వ్యక్తిగత, మానసిక పరిశుభ్రత, ప్రవర్తనా మార్పులు, ఆటలు, క్రీడలు, పునరు త్పత్తి ఆరోగ్యం, మంచి, చెడు స్పర్శ, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కలిగించనున్నామన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు డా. అరవింద్, సభ్యులు రేవతి, ప్రశాంతి, హరిత, డెమో వేంకటేశ్వరరావు, పి.మోహిని తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో డా.అనిత

పశువుల బెడదను అరికట్టండి

ఇచ్ఛాపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సాయినగర్ కాలనీలో పశువుల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ పట్టణ సీనియర్ నాయకుడు నందికి జాని కోరారు. ఈ మేరకు శనివారం కమిషనర్ ఎన్.రమేష్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కాలనీలో ఆవులు, గేదెలు, కుక్కల వల్ల రోడ్లు అపరిశుభ్రంగా తయారవు తున్నాయన్నారు. సంబంధిత యజమానులు వాటిని రోడ్లపై వదిలేయడంతో తరచూ ఇబ్బం దులు తలెత్తుతున్నాయని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీతో పాటు పట్టణంలోని 23 వార్డుల్లో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉందని, వీటి నియంత్రణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆదిత్యుని సేవలో జీఎస్టీ జాయింట్ కమిషనర్

అరసవల్లి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాత అయిన అరసవల్లి సూర్య నారాయణ స్వామిని జీఎస్టీ జాయింట్ కమిషనర్ పి.రామకోటేశ్వరరావు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు స్వాగతం పలుకగా అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ప్రసాదాలు, చిత్రపటాన్ని అర్చకుడు ఇప్పిలి సాందీప శర్మ అందజేశారు.



జ్ఞాపికను అందిస్తున్న అర్చకులు

ఆదిత్యునికి రూ.లక్ష విరాళం

అరసవల్లి సూర్యనారాయణ స్వామికి విశాఖపట్నానికి చెందిన తిరునాథరెడ్డి తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం రూ.1,10,116 విరాళాన్ని శనివారం ఈవో ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా తిరునాథరెడ్డి, ఝాన్సీ దంపతులను అర్చకులు ఆశీర్వదించి ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.వెంకటరమణ పాల్గొన్నారు.

వరుస నాట్లతో ప్రయోజనం

సరుబుజ్జిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వరుస క్రమంలో నాటడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని ప్రకృతి వ్యవసాయం కొత్తూరు డివిజన్ డీపీఎం ధనుంజయరావు అన్నారు. రావివలసలో రైతులతో శనివారం అవగాహన కలిగించారు. వరినాట్లు వరుస క్రమంలో వేసిన పొలంలో అంతర పంటలుగా పెసర, మినుము, నువ్వులు, గోంగూర సాగును వివరించారు. కార్యక్ర మంలో రీజనల్ అధికారులు హేమసుందరరావు, డివిజనల్ ఎంటి సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై దొంగలుగా మారి..

- ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరి అరెస్టు
- రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదువుకోవాల్సిన ఓ ఇద్దరు యువకులు వ్యసనాలకు బానిసై దొంగలుగా మారారు. పదో తరగతి వరకూ చదువుకున్న వీరిద్దరూ ఉన్నత చదువుల చదవకుండా గంజాయి, మత్తు పదార్థాల బారినపడి దొంగతనాలకు పాల్పడి కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డారు. పలాస మండలం గరుడఖండి గ్రామానికి చెందిన కవిటి నిఖిలేష్(22), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా కాశీనగర్‌కు చెందిన తూముల కార్తికేయ(22) కొన్నేళ్ల కిందట టెన్త్ తర్వాత చదువు మానేసి జల్సాలకు అలవాటుపడ్డారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనాల దొంగలుగా మారారు. శనివారం ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వి.వెంకటఅప్పారావు వెల్లడించారు. పలాస మండలం టెక్కలి పట్నం గ్రామానికి చెందిన డోర సురేష్ తన ద్విచక్రవాహనాన్ని ఇంటివద్ద ఈనెల 14న పార్కింగ్ చేశాడు. మరుచటి రోజు ఉదయం చూసేసరికి కనిపించలేదు. దీంతో ఆయన కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గార మండలం మెండ పేట గ్రామానికి చెందిన మెండ ఢిల్లేశ్వరరావు కాశీబుగ్గలో పనుల మీద వచ్చి ఓ ప్రైవేట్ ఆసుపత్రి వద్ద ఈ నెల 18న తన బైక్‌ను పార్కింగ్ చేశాడు. తిరిగి వచ్చిచూసే సరికి తన వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిఖిలేష్, తూముల కార్తికేయ విశాఖ నుంచి వస్తుండగా పోలీసులకు తారాసపడ్డారు. వారిని విచారించగా ద్విచక్ర వాహనాలు తామే దొంగతనం చేసినట్టు అంగీకరించారు. వీరిద్దరూ శ్రీకాకుళం పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి వరకూ కలసి చదువుకున్నారు. మద్యం, గంజాయి, ఆన్‌లైన్ బెట్టింగులకు అలవాటుపడి చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. వీరి తల్లిదండ్రులు ఇచ్చే డబ్బులు సరిపడక పోవడంతో ద్విచక్ర వాహనాలు దొంగతనం చేస్తూ జల్సాలకు అలవాటు పడ్డారు. విశాఖలో కూడా వీరిపై ద్విచక్ర వాహనాల దొంగతనాలపై కేసులు నమోదయ్యాయి. చోరీ చేసిన వాహనాలను విశాఖలో అమ్మేసి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తుంటారు. వీరిద్దరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. సీఐ పి.సూర్యనారాయణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- కేరళలో వలస కూలీగా..
- మూడు రోజుల కిందటే గ్రామానికి రాక..


సన్నరాజు(ఫైల్)

కంచిలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మఖరాంపురం కూడలి ఆదివారం సంత సమీపంలో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కత్తివరం పంచాయతీ పులకపుట్టుగకి చెందిన పులక సన్నరాజు (28) మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. సన్న రాజు ద్విచక్ర వాహనంపై కంచిలి వైపు నుంచి రాంగ్ రూట్‌లో ఇచ్ఛాపురం వైపు వెళుతుండగా ఎదురుగా ఇచ్ఛాపురం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఓ ప్రైవేటు బస్సు బలంగా ఢీ కొంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం నుజ్జు నుజ్జు కాగా, సన్న రాజుకు తీవ్ర గాయాలై, అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై కంచిలి ఏఎస్ఐ పి.అప్పలరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులు వాసులు, రమణమ్మ వ్యవసాయ కూలీలు. మృతుడు కేరళలో వలస కూలీగా పని చేస్తూ.. మూడు రోజుల కిందటే స్వగ్రామానికి వచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆటో

- బైక్‌పై వెళుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రాజశేఖర్

పొందూరు, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): గోరింట గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రగాయాల పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పెనుబర్తి ఐఆర్ కాలనీకి చెందిన మడపాన రాజశేఖర్ ద్విచక్ర వాహనంపై గోరింట వైపు వెళుతుండగా పొందూరు నుంచి వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. దీంతో రాజశేఖర్ తలకు తీవ్రగాయాలు కావడంతో పాటు కాళ్లు, చేతులు విరిగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు బీఎస్సీ చదువుతున్న రాజశేఖర్.. తల్లిదండ్రులు రోజుకూలీలు. వైద్యచికిత్సకు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుందని ఆసుపత్రి వర్గాలు తెలపడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఘటనపై ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయాధికారి


రికార్డులు పరిశీలిస్తున్న న్యాయాధికారి వాణి

నరసన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును నరసన్నపేట సివిల్‌కోర్టు న్యాయాధికారి ఎస్.వాణి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. సబ్‌జైల్‌లో నిందితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో జైలు అధికారి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాగ్ స్క్వాడ్స్‌తో తనిఖీలు

టెక్కలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): టెక్కలిలో శనివారం డాగ్ స్క్వాడ్ తనిఖీలు పోలీసులు చేపట్టారు. ఎస్ఐ-2 రఘునాథరావు ఆధ్వర్యంలో టెక్కలిలోని పలు కిరాణా, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్, పాన్ షాపుల్లో తనిఖీలు చేశారు. నిషేధిత వస్తువులు అమ్మకం లభ్యతకు జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

- నందిగాం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందిగాంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు శనివారం నిర్వహించారు. పోలీసుల ఆధ్వర్యంలో పలు కిరాణా షాపుల్లో పోలీసు డాగ్‌తో తనిఖీలు చేశారు.

నూతన విద్యావిధానంతో సమయం వృథా


మాట్లాడుతున్న ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

ఎల్ఎన్ పేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యావ్యవస్థ మెరుగుపడుతుందనే ఆలోచనలతో తీసుకువస్తున్న నూతన విధానాలతో సమయం వృథా అవుతుందే తప్పా ఎటువంటి ప్రయోజనం లేదని ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రమణ తెలిపారు. సభ్యత్వ నమోదు, ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా శనివారం బొర్రంపేట, మల్లికార్జునపురం, చింతలబడవంజ, డొంకల బడవంజ, కరకవలస జడ్పీ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. కరకవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యావ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న నూతన విధానాలతో సమయం వృథా కావడమే కాకుండా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు దూరం పెరుగుతుందన్నారు. దీంతో పాఠాలు బోధించేందుకు పూర్తిగా సమయం లేకుండా పోతున్నందున ఏ విధంగా విద్యార్థులు పరీక్షలు రాయగలరన్నారు. సమావేశంలో సంఘ నాయకులు పి.రామకృష్ణ, ఎ.వెంకట్, కె.చంద్రరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాళ్లు తేలి.. గోతులు పడి

- అసంపూర్తిగా వదిలేసిన రహదారి
- రాకపోకలకు ప్రజలు ఇబ్బంది
- బిల్లులు అందక చేతులెత్తేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

పాతపట్నం రూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రహదారి పనులు చేయకుండా వదిలేయడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పల్లెపండుగ పేరుతో రహదారుల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో కొన్నిచోట్ల చేపట్టిన పనులు సగంలోనే వదిలేయడంతో ఆయా గ్రామాల ప్రజలు మరిన్ని అవస్థలు పడుతున్నారు. మండలంలో గల సింగుపురం జంక్షన్ నుంచి సింగుపురం వరకు, అక్కడ నుంచి బగదల, రట్టిపేట, గురండి వరకు పీఆర్‌లో సుమారు రూ.1.60లక్షలతో రోడ్డు పనులు చేపట్టారు. అయితే బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడుతున్నారు. సుమారు ఐదు కిలోమీటర్లు రహదారి పనులు చేట్టే క్రమంలో తవ్వేసి మెటల్ వేసి వదిలేయడంతో మరింత అధ్వానంగా తయారైంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం.. మార్గంలోనే చెరువు గట్టు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు భయాందోళన చెందుతున్నారు. సుమారు నాలుగు గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తున్నా అధికారుల్లో చలనం రావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారి పనులు పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


మెటల్ తేలడంతో ప్రమాదకరంగా మారిన రోడ్డు


సగంలోనే వదిలేయడంతో ఇలా..

ప్రభుత్వంపై బురదచల్లడం తగదు

- ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): సంక్షేమం దిశగా రాష్ట్ర ప్రభుత్వం అన్నీ చర్యలు తీసుకొని ముందుకు వెళ్తుంటే ప్రతిపక్ష పాత్ర పోషించి ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాల్సిన వైసీపీ మాత్రం బురదచల్లే ప్రయత్నం చేస్తుండడం తగదని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గ పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌చార్జీలు, కన్వీనర్లు, ఇతర ముఖ్య నాయకులతో పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ కార్యక్రమాలు సూపర్‌హిట్ కావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఏదో ఒక విధంగా బురదచల్లి రాజకీయ లబ్ధి పొందాలనుకునేవారికి ఇప్పటికే ప్రజలు బుద్ధి చెప్పారని, ఇదేవిధానం కొనసాగితే వారికి శాశ్వతంగా స్వస్తి చెబుతారన్నారు. వికలాంగుల పింఛన్ల వ్యవహారంలో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయడాన్ని ఇప్పటికే అంతా గుర్తించారని, వారివి ఫేక్ అని తేలిపోయిందన్నారు. వర్షాలు వస్తే అమరావతి మునిగిపోయిందని, ఉచితంగా మహిళలకు బస్సు సౌకర్యం కల్పిస్తే దానిపై కల్పితాలు అల్లారని వారు ఏనాడయినా నిజం ప్రజలకు చెప్పారా అని ప్రశ్నించారు. పలాస నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధికి అంతా సహకారం అందించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావుయాదవ్, మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, టంకాల రవిశంకర్‌గుప్తా, జోగ మల్లి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

శివారు భూములకు సాగునీరు అందిస్తాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ పుండ్కర్

పలాస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): శివారు భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందిస్తామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఈ మేరకు శనివారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి అంతరకుడ్డ సమీపంలో ఉన్న వంశధార కాలువను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివారు భూములకు నీరు వెళ్లాలంటే ఎంత మేర వసరం, ఇంకా ఎన్ని చెరువుల నిండాల్సి ఉంది అనే అంశంపై వంశధార ఈఈ శేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. అంతరకుడ్డలో ప్రధాన సమస్య వరద నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కల్వర్టును తొలగించి స్లాబ్ వేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలకు కోరగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అధికారులు రాజశేఖర్, మీనాక్షి, నీటి సంఘం అధ్యక్షుడు నిరంజన్, టీడీపీ నాయకులు బి.నాగరాజు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయ భవనం తొలగింపు

పాతపట్నం ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ పాతపట్నం ప్రధాన కూడలిలోగల పంచాయతీ కార్యాలయాన్ని శనివారం తొలగించే పనులు చేపట్టారు. ఇదే స్థలంలో అన్నా క్యాంటీన్ నిర్వాహణకుగానూ కొత్త భవన నిర్మాణానికి పంచాయతీ సభ్యులు తీర్మానించడంతో ఈ భవన తొలగిస్తున్నట్టు ఈవో ఊన రామంద్రరావు తెలిపారు. పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న సచివాలయంలో పంచాయతీ సేవలు ఇకనుంచి కొనసాగుతాయని ఆయన తెలిపారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ప్రాథమిక స్థాయిలో అంతరిక్ష ప్రయోగాలపై అవగాహన కల్పించడం ద్వారా ఆసక్తి కలుగుతుందని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు సూచించారు. శనివారం మండలం బసివలస ప్రాథమిక పాఠశాలలో జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. అంతరిక్ష ప్రయాణంలో భారత్ నాలుగో దేశంగా నిలిచిందని ప్రయోగాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని ఉపాధ్యాయులు నక్క అప్పయ్య అన్నారు. విద్యార్థులకు అంతరిక్ష యానంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాబారావు తదితరులు పాల్గొన్నారు.

- పలాస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి అంతరిక్ష పరిశోధనల ప్రాముఖ్యత, మన దేశం సాధించిన విజయాలను వివరించారు. నిర్వహించిన వివిధ పోటీల్లో బి.గాయత్రి, బి.రూప, సౌమ్య నాయక్ విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో లెక్చరర్ హేమాచలం, వైస్‌ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, లైబ్రేరియన్ నర్సింహులు, పీడీ మధు, అధ్యాపకులు పాల్గొన్నారు.


విజేతలతో ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి, అధ్యాపకులు

'స్త్రీశక్తి'తో మహిళలకు ఆర్థిక భరోసా


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పాతపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలుతో మహిళలకు ఆర్థిక భరోసా లభిస్తుందని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్వగృహం వద్ద స్త్రీశక్తి పథకం విజయోత్సవ సభను శనివారం సాయంత్రం నిర్వహించారు. ముందుగా ఉత్కళాంధ్రుల ఆరాధ్యదైవం నీల మణిదుర్గ ఆలయంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే గోవిందరావు పేరిట ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం సభా స్థలిలో టీడీపీ వ్యవస్థాపకులు, దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల టీడీపీ అధ్యక్షులు, పీఏసీఎస్, ఏఎంసీ అధ్యక్షులు సలాన మోహనరావు, లోతుగెడ్డ తులసీ వరప్రసాద్, పైల బాబ్జీ, మామిడి రామకృష్ణ పిన్నింటి గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముఖహాజరు తప్పనిసరిగా వేయాలి

వజ్రపుకొత్తూరు, 23(ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు ప్రతీరోజు కళాశాలకు వచ్చి ఉదయం 9 గంటలకు సాయంత్రం 5గంటలకు ముఖహాజరు తప్పనిసరిగా వేయాలని జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి ఎ.సురేష్‌కుమార్ అన్నారు. శనివారం పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, అధ్యాపకుల టీచింగ్ డైరీ, టీచింగ్ నోట్స్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఎంసెట్, నీట్‌పై విద్యార్థులకు తరగతులు పక్కాగా బోధించి వీకెండ్ టెస్ట్‌లు పెట్టాలన్నారు. అనంతరం ప్రయోగశాలలను పరిశీలించి పలు సూచనలు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయక్, అధ్యాపకులు కేశవరావు, జాన్సీ, రాంబాబు, రమణ తదితరులు పాల్గొన్నారు.

బార్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

పలాసరూరల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): నూతన బార్ల పాలసీ (2025-26) ప్రకారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో జనరల్ కేటగిరిలో రెండు, గీత కార్మికుల (సొండి) కేటగిరిలో ఒకటి ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీలోగా ఆసక్తి కలవారు దరఖాస్తులు చేసుకోవాలని, 28న శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ తీయబడుతుందన్నారు. కాగా గీత కార్మికుల విభాగంలో ఈ నెల 29వ తేదీన వరకూ దరఖాస్తు చేసుకోవాలని, వారికి ఈ నెల 30వ తేదీన శ్రీకాకుళం కలెక్టరేట్‌లో లాటరీ తీయనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 9502627569 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

సంస్కృత భాషను ఆదరించాలి

మందస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): అద్వితీయమైన సంస్కృత భాషాను ప్రతీ ఒక్కరూ ఆదరించాలని ఉపాధ్యాయురాలు పీబీజీ గైర్వాణీ కోరారు. మందస శ్రీరాజాశ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సంస్కృతభాష దినోత్సవం శనివారం నిర్వహించి, దాని ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ మూర్తి, నారాయణరావు, కృష్ణారావు, దుర్గారావు, కవిత పాల్గొన్నారు.


వజ్రపుకొత్తూరు: బాతుపురం వద్ద విద్యుత్తు స్తంభం..


పాతపట్నం: తీగలు తొలగించిన తర్వాత ఇలా..

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తీగ మొక్కలు తొలగింపు

పాతపట్నం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయం చేరువలో గల విద్యుత్ స్తంభానికి అల్లుకొని ఉన్న తీగమొక్కలను శనివారం తొలగించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం 'ఇంత నిర్లక్ష్యం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ఈతీగ మొక్కల తొలగింపుపై గంథాలయ పాఠకులతో పాటు పరిసరవాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

- వజ్రపుకొత్తూరు, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): బాతుపురం వద్ద విద్యుత్తు స్తంభానికి వైర్లుకు చుట్టుకున తీగ మొక్కలను విద్యుత్ అధికారులు తొలగించారు. ఆంధ్రజ్యోతిలో శనివారం ప్రచురితమైన కథనానికి ఏఈఈ వెంకటేష్ స్పందించి తీగ మొక్కలను సిబ్బంది సాయితో తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

శతాధిక వృద్ధురాలి మృతి


అప్పోజమ్మ(ఫైల్)

హరిపురం, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): మందస మండలం హరిపురం గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కాసులదేవ అప్పోజమ్మ (103) శనివారం అనారోగ్యంతో బాధపడుతూ ఇంటివద్దనే చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈమెకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. హరిపురం నుంచి జీవనోపాధి కోసం బర్మా దేశం రంగూన్ వెళ్లిన అప్పోజమ్మ కుటుంబం అక్కడ జరిగిన బాంబుదాడులతో నడక మార్గంలో స్వగ్రామమైన హరిపురం చేరుకున్నారు. ఆమె మృతిపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు సంతాపం తెలిపారు.

నేడు ఎల్‌సీ గేటు మూసివేత

పలాస, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ రైల్వే గేటు మరమ్మతుల దృష్ట్యా ఆదివారం ఏడు గంటల పాటు నిలుపుదల చేస్తున్నట్టు రైల్వే శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అత్యవసర మరమ్మతులకు గాను ఆదివారం ఉదయం వేకువజాము 2గంటల నుంచి ఉదయం 9గంటల వరకూ ఏడు గంటల పాటు నిలుపుదల చేస్తున్నట్టు తెలిపారు. ఈ అంతరాయానికి ప్రయాణికులు వాహనదారులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు.

2న రక్తదాన శిబిరం

టెక్కలి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మది నోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చే నెల 2న స్థానిక పార్టీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్ కుమార్ తెలిపారు. మండలాల వారీగా ఎవరెవరు రక్తదానం చేయనున్నారో వివరాలు ముందుగా తెలియజేయాలని కోరారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, మెగా కుటుంబ అభిమానులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బహుమతులు అందజేత

హరిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): మందస మండలం బహాడపల్లిలో ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన జానపద గేయాలు, వ్యాస రచన పోటీల్లో విజేతలకు సిక్కోలు జానపద సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మామిడి కృష్ణారావు బహుమతులు అందజేశారు. జానపద గేయాల పోటీల్లో బెండి గ్రామానికి చెందిన కోనారి హేసూధన్, లోహరిబంద గ్రామానికి చెందిన నక్క వాసు, బైపల్లి గ్రామానికి చెందిన చెల్లూరి జయంత్ మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో యు.సంధ్య (గీతం హైస్కూల్), ఆర్.వర్షిత (హరిపురం హైస్కూల్), పి.దీక్షిత (గీతం హైస్కూల్), టి.హని (గరుడుబద్ర హైస్కూల్) విద్యార్థులు మొదటి నాలుగో స్థానాలు సాధించారు. విజేతలకు షీల్డ్‌లతోపాటు నగదు ప్రోత్సాహకం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దానయ్య, సాహితీ వేదిక సభ్యులు రాపా ధనరాజు, రేలారేలా రఘు, గొరకల లోకేశ్వరరావు, కుత్తుం వినోద్, సాలిన మాధవరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను నియంత్రించాలి

హరిపురం, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మందస ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ అన్నారు. మందస మండలం హరిపురం, మందస, రట్టి, బహాడపల్లి తదితర రహదారుల్లో రోడ్డు మలుపుల వద్ద ఆయా గ్రామాల యవత, పోలీసులతో కలిసి శనివారం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనంతరం పోలీసుస్టేషన్ పరిసరాల్లో శ్రమదానం చేపట్టారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బందితోపాటు యువత పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

కోటబొమ్మాళి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండగ సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే వారు నిబంధనలు పాటించాలని సీఐ కె.శ్రీనివాసరావు అన్నారు. ఆయన శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ వి.సత్యనారాయణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. మండపాలు ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. డీజేలు, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు

పోలాకి, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని ఈదులవలస మోడల్ స్కూల్ పీడీ ఎం.నీలం ఆధ్వర్యంలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. శనివారం బాలికలకు శారీప్లే, స్టిక్‌ప్లే, బాలురకు పిరమిడ్, కబడ్డీ, పరుగు పందెంలో తర్ఫీదు నిచ్చారు. బాలికలకు ప్రత్యేకంగా కోలాటం నేర్పిస్తున్నారు.